వ్యవసాయమేదీ?

ఖరీఫ్‌లో సాగైన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా దారుణంగా దెబ్బతిన్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. సంక్రాంతి పండుగకైనా బ్యాంకు ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ య్యేనా అని వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

- ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలు
- విడుదల కాని ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు
- పెట్టుబడుల కోసం చేసిన అప్పులతో సతమతం
- సాయం కోసం ధర్మవరం నియోజకవర్గ రైతుల ఎదురుచూపు




దిగుబడి లేని కంది పంట



తుపాను కారణంగా తడిసిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

ధర్మవరం రూరల్: వ్యవసాయ రంగాన్ని కూటమి సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన అన్నదాతా సుఖీభవ కింద రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న పెట్టుబడిసాయం అతీగతీ లేదు. గత ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. రైతన్నలకు వ్యవసాయ పనులు చేపట్టక ముందే రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేసి ఊరట కల్పించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై దృష్టి సారించలేదు. ఖరీఫ్–2024లో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని రైతులు వేరుశనగ, కంది, మొక్కజొన్న, జొన్న, కొర్రలు, ఆముదం, పెసలు, ఆముదం తదితర పంటలు సాగు చేశారు. అయితే వాతావరణ మార్పులు, అధిక వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ సిబ్బంది ఈ– క్రాప్ నమోదు చేశారు. అయితే పంటలు సాగు చేసి ఈ–క్రాప్ చేసిన రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కేటాయించిన నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడం గమనార్హం.

త్వరలో జమ చేస్తాం



పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను త్వరలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసే అవకాశం ఉంది. పంటలు సాగు చేసి ఈ– క్రాప్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు వారి ఖాతాల్లోకి జమవుతాయి. అయితే ఎప్పుడు జమ చేస్తారనే విషయం మాకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేవు. – కృష్ణయ్య, ధర్మవరం ఏడీఏ

ఖరీఫ్ పంటల సాగు.. ఇన్‌పుట్ సబ్సిడీ నిధుల కేటాయింపు వివరాలు

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం	ప్రకటించిన నిధులు
ధర్మవరం	5,831	16,276 ఎకరాలు	రూ.923.16 లక్షలు
తాడిమర్రి	2,517	7,075 ఎకరాలు	రూ.369.20 లక్షలు
ముదిగుబ్బ	8,531	21,712 ఎకరాలు	రూ.1287.83 లక్షలు
కనగానపల్లి	8,396	23,360 ఎకరాలు	రూ.706.96 లక్షలు
రామగిరి	92	13,000 ఎకరాలు	రూ.1144.16 లక్షలు

క్లుప్తంగా

పంటల సమాచారం సిద్ధంగా ఉండాలి

తాడిమర్రి: కేంద్ర కరువు అధ్యయన బృందం పర్యటన నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది మండలానికి సంబంధించిన పంటల సాగు సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని ఏడీఏ కృష్ణయ్య ఆదేశించారు. తాడిమర్రి రైతు సేవ కేంద్రంలో మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గత ఏడాది మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు చేతికందలేదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతో కరువు పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర బృందం బుధవారం పర్యటిస్తుందన్నారు. ఉదయం 11.50 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు తాడిమర్రిలో ఈద్గావద్ద ఉలవ పంట పరిశీలిస్తారన్నారు. అనంతరం వారు రైతు సేవ కేంద్రంలో కరువు పరిస్థితుల చిత్రాల ప్రదర్శనను తిలకిస్తారని వివరించారు. అందరూ తప్పకుండా విధులకు హాజరై అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, వీఏఏ విజయ్‌కుమార్, వీహెచ్‌ఏ గౌతమి పాల్గొన్నారు.

ఎట్టకేలకు అద్దె దుకాణాల వేలం



వేలం నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరసింహనాయుడు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రహరీకి ఆనుకుని నిర్మించిన అద్దె దుకాణాలకు ఎట్టకేలకు వేలం నిర్వహించారు. అధికార టీడీపీ నాయకుల్లో నెలకొన్న విభేదాల కారణంగా వేలం పలు దఫాలు వాయిదా పడింది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహనాయుడు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. దుకాణాలు దక్కించుకునేందుకు టీడీపీ, బీజేపీ నాయకులు పోటీపడ్డారు. మూడు దుకాణాలకు గాను 9 మంది ఒక్కొక్కరు రూ.10వేలు చెల్లించి ధరావత్తు డిమాండ్ డ్రాఫ్టును చెల్లించిన వారిని మాత్రమే వేలం పాటకు అనుమతించారు. మొదటి దుకాణం రూ.11 వేలకు కాకర్ల సురేంద్రనాయుడు, రెండవ దుకాణం రూ.26,500కు లక్ష్మీనారాయణ, మూడవ దుకాణం రూ.23వేలకు నితీష్ దక్కించుకున్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి



శిక్షణలో పాల్గొన్న ఉపాధి హామీ సిబ్బంది

బత్తలపల్లి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఉపాధి హామీ సిబ్బందికి ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాబోవు ఆరు నెలల్లో ప్రాధాన్యతా క్రమంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఫిష్‌పాండ్, అమృత్ సరోవర్ ఒక్కొక్కటి చొప్పున, రెండు గోకులాలు, 25 ఫారంపాండ్స్, 20 రింగ్, బౌండరీ ట్రెంచ్ పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదెప్ప, జేఈ నాగార్జునతో పాటు సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పద్య పఠన పోటీలు

బత్తలపల్లి: వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన ఎనిమిదో తరగతి విద్యార్థి పీవీ కారుణ్యరెడ్డి, ద్వితీయ స్థానంలో నిలిచిన పదో తరగతి విద్యార్థి బి.తరుణ్, తృతీయ స్థానంలో నిలిచిన ఏడో తరగతి విద్యార్థి కె.సాయిచరణ్‌కు షీల్డ్‌తో పాటు వేమన శతక పుస్తకం, ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. మరో ఏడుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పద్య పఠన పోటీలు నిర్వహించగా రాగ, భావయుక్తంగా పాడి గెలుపొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ మాధవి అభినందించారు.

రేషన్ కోసం పడిగాపులు



చలపతినాయుని సత్రం స్టోర్ వద్ద క్యూ

కదిరి టౌన్: కార్డుదారులు రేషన్ సరుకుల కోసం స్టోర్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటివద్దకే రేషన్ సరుకులు అందించేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి పాత పద్ధతిలో అంటే చౌకధాన్యపు దుకాణాల్లోనే సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో కూలీనాలీ చేసుకునే పేదలు పని మానుకుని రేషన్ సరుకుల కోసం స్టోర్ల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. మంగళవారం కదిరి పట్టణంలో పలు స్టోర్ల వద్ద జనం బారులు తీరారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ బాలానాయక్

ఎన్పీకుంట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ ఈటె రాము కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, కేజీబీవీ నుంచి అధికారులు హాజరు కాలేదు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల గురించి ఎవరితో చర్చించాలని సభ్యులు ప్రశ్నించారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లను సర్వేలకు ఉపయోగించుకుంటుండడంతో తమ విధులకు ఆటంకం కలుగుతోందని వెటర్నరీ డాక్టర్ బాలానాయక్ సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ శాఖలకు సంబంధించిన సచివాలయ సిబ్బందికి సర్వే పనులు అప్పగించామని ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేజీబీవీలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని పలువురు సభ్యులు తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు మగ్బూల్‌బీ, సరస్వతి, లక్ష్మీదేవి, కృష్ణమ్మ, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ సుబహాన్, సర్పంచులు అంజినమ్మ, రాధ, దిల్షాద్, నాగమునీశ్వరనాయుడు, విష్ణుమూర్తి, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరు కావాలన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ శోభ సువర్ణమ్మ

తనకల్లు: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శోభ సువర్ణమ్మ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఏవైనా ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్జీలపై విచారణ జరిపి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మంగళవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి 20 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, వీఆర్ఓలు రఘు, అనూష, దీపిక, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్ట్ పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ



చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

కదిరి అర్బన్: విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ (2024–25) పోటీల్లో కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫైనలియర్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మణికంఠ, యువరాజ్‌లు ప్రతిభ కనబరిచారు. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రూ.25 వేల నగదు రివార్డుతో పాటు మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఫైర్ ఫైటింగ్ రోబోట్ వినూత్న ఆవిష్కరణకుగాను రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి గెలుచుకున్నారు. అవార్డు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రమ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ హెడ్ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

జర్నలిస్టులపై దాడులను ఖండించాలి

పుట్టపర్తి టౌన్: ప్రజాస్వామ్య దేశంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు అడపాల మేమనారాయణ పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంలో రూ.100 కోట్లకు పైగా అవినీతి జరిగిందని జాతీయ మీడియా ద్వారా ప్రచారం చేశారన్న అక్కసుతో జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్‌ను హత్య చేసి, మానవ సమాజం సిగ్గుపడేలా అవయవాలు బయటకు తీసి ముక్కలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ

ధర్మవరం రూరల్: ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను డీఈఓ కృష్ణప్ప మంగళవారం ధర్మవరంలో విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నాగార్జున, భాస్కర్‌రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

ధర్మవరం నాట్య గురువులకు అవార్డులు



అవార్డులు, ప్రశంసాపత్రాలతో కళాకారులు

ధర్మవరం రూరల్: తమిళనాడులోని అరుణాచలం దేవాలయంలో సోమవారం సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవల్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో ధర్మవరం శ్రీలలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ శిష్య బృందం 40 మంది పాల్గొన్నారు. వీరి నాట్య ప్రదర్శనకు మెచ్చి ఆదియోగి అవార్డులు ప్రదానం చేశారు. అలాగే గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీలను 'నాట్య తపస్వి' అవార్డులు, అలాగే హర్షశ్రీ, రామలాలిత్యలను 'నాట్య చూడామణి' అవార్డులతో సంస్థ అధ్యక్షులు ఆనంద్, దేవాలయం ఈఓ సురభి రాయల్ సన్మానించారు.

చేపల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న ఎండీ ఉదయ్ కిషన్

తాడిమర్రి: రైతులు ప్రత్యామ్నాయం కింద చేపల పెంపకం చేపడితే లాభదాయకంగా ఉంటుందని ఆక్వా కనెక్ట్ ఎండీ ఉదయ్ కిషన్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం సాంబశివుడు అధ్యక్షతన రైతులు, మహిళలకు చేపల పెంపకం (ఆక్వా యూనిట్–కొర్రమీను)పై జరిగిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు, చీడపీడలు, పెట్టుబడి ఖర్చులు తదితర సమస్యలతో పంటలు పండక ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రత్యామ్నాయంగా చేపల పెంపకం చేపట్టడం లాభదాయంగా ఉంటుందన్నారు. ఎకరం పొలంలో చేపలను సాగు చేస్తూ ఏడాదికి మూడు పంటలు తీసుకోవచ్చని సూచించారు. అనంతరం వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కేఎస్ నర్సయ్య మాట్లాడుతూ నీటి సౌకర్యం కలిగిన పొలంలో మహిళలు చేపల పెంపకం చేపడితే యూనిట్ ఏర్పాటుకు కావలసిన నిధులను అందిస్తామన్నారు. యూనిట్ ఏర్పాటు చేసుకున్న మహిళలకు బ్యాంక్‌లు కూడా రుణాలను అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో జీవన ప్రమాణాల వృద్ధి సంస్థ డీపీఎం రామ్మోహన్, వెలుగు ఏసీ ఎంకే సత్యనారాయణ, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాసరావు, ఎఫ్‌పీవో ఏపీఎం హరిప్రసాద్, రమణప్ప, ఉన్నతి అనసూయ, సీసీలు నారాయణమూర్తి, గంగాధర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ తిరుపాల్ నాయక్

నల్లచెరువు: స్థానిక వేమన ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు మంగళవారం తనిఖీ చేశారు. పరిసరాలన్నీ కలియదిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో రీసర్వేపై గ్రామసభ



మల్లేపల్లిలో గ్రామ సభను నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మల్లేపల్లిలో భూముల రీ సర్వేపై మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేలో వచ్చిన సమస్యలపై రైతులతో తహసీల్దార్ నారాయణస్వామి చర్చించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీఐ మురళి, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అమడగూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం, బాల బాలికలకు బంగారు భవిష్యత్తుకు పునాదులు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్లలోపు వయసు కలిగిన బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపర్చడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జిలాన్‌బాషా, ఏపీఎం భారతి, సుకన్య, నాగరాజు, మహిళా పోలీస్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 'కిశోరి వికాసం'పై ఐసీడీఎస్ సీడీపీఓ సునంద ఆధ్వర్యంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రమణప్ప, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, బాల్య వివాహాలు, లైంగిక వేధింపుల నివారణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం హేమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ, దేవమణి, ఏఎన్ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తాడిమర్రి: మండలంలో వెనుకబడిన సామాజిక వర్గాల యువతీ యువకులు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరంగారావు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ తదితర ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని నిరుద్యోగులు రుణాలకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 8 నుంచి 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు.

ఓడీచెరువు : ఈడబ్ల్యూఎస్, బీసీ సామాజికవర్గాల్లోని నిరుద్యోగులు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చేసిన వారికి జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఓడీచెరువు: వీరప్పగారిపల్లిలో మంగళవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో వెళ్లి తనిఖీ నిర్వహించారు. గ్రామానికి చెందిన గంగాద్రి, నాగవేణి దంపతులు సంచిలో పెట్టుకుని కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. 20 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై ఆగ్రహం



ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్ వాగ్వాదం

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు అమీర్‌బాషాపై ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపాల్సిన యూటీ (యుటిలైజేషన్ సర్టిఫికెట్)లపై సంతకం చేయాలని ఎంపీడీఓ వద్దకు సీనియర్ సహాయకుడు వెళ్లాడు. సంతకం చేయించుకున్న తర్వాత ఆ ఫైలును ఆయన జూనియర్ అసిస్టెంట్‌కు పంపాడు. తనకు తిరిగి ఫైల్ ఇవ్వకుండా అక్కడకు పంపడమేంటని సీనియర్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓ మండిపడ్డారు.

11న మహా ధర్నా

కదిరి అర్బన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 11న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు నాయకులు గౌస్‌లాజమ్, షర్ఫుద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యంతర భృతి, సరెండర్ లీవుల చెల్లింపులు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ తదితర సమస్యలపై చేపట్టే మహాధర్నాకు ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విస్తృతంగా పనులు కల్పించండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీపీ, అధికారులు

ఎన్పీకుంట: ఉపాధి హామీ కూలీలకు విస్తృతంగా పనులు కల్పించాలని ఎంపీపీ ఈటె రాము సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, ఏపీఓ చంద్రశేఖర్, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గాండ్లపెంట: మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నూతన క్యాలెండర్‌ను ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షులు జంపాల రమణ, కార్యదర్శి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద, సహచర ఉద్యోగులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు నమోదు చేసుకోండి

బత్తలపల్లి: కందుల కొనుగోలు కోసం సంబంధిత రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి సూచించారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 11 రైతు సేవ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలు మద్దతు ధర రూ.7,550 లేదా మార్కెట్ ధర ఏది ఎక్కువ అయితే ఆ ధరతో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. రైతులు తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

నేడు జేకేపల్లికి కేంద్ర బృందం

ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లి (జేకే పల్లి)లో బుధవారం కేంద్ర బృందం పర్యటించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కరువు వల్ల దెబ్బ తిన్న పొలాలను వారు పరిశీలిస్తారన్నారు. అదే విధంగా రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. రైతులు తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.